RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 245 | ఆగస్టు 29, 2025 | వెల : రూ.3-00



స్థానిక సంస్థల ఓటర్ల జాబితా సవరణను వాయిదా వేయాలి

2లో..



# జల దిగ్బంధంలో కామారెడ్డి..!

- అతలాకుతలమైన జనజీవనం..!
- ఆగమైన పట్టణం.. బీభత్సం సృష్టించిన వరద
- ఇళ్లలోకి భారీగా చేరిన వరద నీరు
- రహదారులన్నీ జలమయం

**వేద న్యూస్, కామారెడ్డి :**

కామారెడ్డి జిల్లాలో దంచికొట్టిన వానలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. బుధవారం ఒక్కరోజే కామారెడ్డి జిల్లాలోని రాజంపేటలో 44 సెంటి మీటర్ల వర్షం కురవగా, గురువారం నాలుగు గంటల వ్యవధిలోనే రామారెడ్డి ప్రాంతం లో 17 సెంటి మీటర్ల వర్షం కురిసింది. రెండు రోజులుగా కుండపోతగా కురిస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది.

**- రికార్డు స్థాయిలో వర్షం**

రెండు రోజులుగా కుండపోతగా కురిసిన వర్షానికి కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలు అతలాకుతలమ య్యాయి. రికార్డు స్థాయి వర్షాలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్లుగా కురిసిన వానలతో



వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పోటెత్తిన వరద ప్రవాహానికి, పలుచోట్ల చెరువులు, రోడ్లు తెగిపోయాయి. రహదారులు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలను వరద చుట్టుముట్టడంతో ఇళ్లు జలమయ్యాయి. కామారెడ్డి పట్టణ కేంద్రంతోపాటు జిల్లాలోని గ్రామాలు జలదిగ్బంధంలోకి చిక్కుకుపోయాయి. గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు అధికా రులు తరలించారు. పునరావాస కేంద్రాల సంఖ్య పెంచడంతో పాటు సహాయక చర్యలను రెస్క్యూ టీం కొనసాగిస్తోంది. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు సూచన కనిపిస్తుండడంతో జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం సహాయక చర్యల్లో తలమునకలైంది.



## పురిటి నొప్పులతో నిండు గర్భిణి

### - జేసీబీ సాయంతో ఒడ్డు దాటింపు

**వేద న్యూస్, రాయికల్:**

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్‌కు చెందిన లక్ష్మీ అనే గర్భిణికి గురువారం పురిటి నొప్పులు రావడంతో రాయికల్ కు తీసుకెళ్తుండగా, రామోజీపేట - భూపతి పూర్ మధ్య గల లో లెవల్ వంతెన పై భారీగా వరద నీరు వచ్చింది. దాంతో స్థానికులు జేసీబీ సహాయంతో గర్భిణిని సురక్షితంగా లో లెవల్ వంతెన దాటించి 108 లో రాయికల్ కు తరలించారు.

## అన్నదానం మహాదానం..



### - గోనె రాంప్రసాద్


**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని గోనె రాంప్రసాద్ అన్నారు. గణేశ్ నవరాత్రులలో భాగంగా గురువారం కరీమాబాద్ ప్రాంతంలో శ్రీ వినాయక సంఘం వారు ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద గోనె రాంప్రసాద్, మిట్టపల్లి భాస్కర్ లు ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదానం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కంట్రోల్ రూం సేవలు వినియోగించుకోవాలి

### -కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**వేద న్యూస్, సిరిసిల్ల టౌన్ :**



రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గతంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సేవలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో సంబంధిత అన్ని శాఖలను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలలో లో లెవెల్ కాజ్ వే ల వద్ద అప్రమత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వ్యవసాయ, హెల్త్, పి.ఆర్, మిషన్ భగీరథ ఇతర శాఖల అధికారులు కంట్రోల్ రూంలో సేవలు అందిస్తున్నారని తెలిపారు.వివిధ అధికారులు అందుబాటులో ఉండి, వర్షాలు, వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు తగిన సమాచారం అందిస్తారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, వరద ప్రభావిత ప్రజలకు సహాయం చేసేలా సేవలు అందిస్తారు. 24 గంటలు ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్లు టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 1495, వాట్సాప్ సెల్ నెంబర్ 9398684240 లను వర్షం, వరద ప్రభావిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రజలకు సూచించారు.జిల్లా, మండల స్థాయి అధికారులు తమ, తమ హెడ్ క్వార్టర్స్ , క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## వరదలో చిక్కుకున్న వారు క్షేమం

- హెలికాప్టర్ల ద్వారా ఎదుగురిని సురక్షిత ప్రాంతానికి తరలించిన ఆర్మీ అధికారులు
- ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్, ఎస్పీ

**వేద న్యూస్, గంభీరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకున్న వారిని క్షేమంగా తరలించినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పి మహేష్ బి గితే తెలిపారు. నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్టు అవతలి వైపు పశువులను మేపేందుకు వెళ్లి ఏడుగురు, అక్కడే చిక్కుకుపోగా, కలెక్టర్, ఎస్పీ సహాయక చర్యలను ముమ్మరం చేశారు. చిక్కుకున్న వారికి ఆహార సదుపాయం కల్పించారు. హకీంపేటలోనే సైనిక హెలికాప్టర్లు చేరుకొని ఐదుగురిని క్షేమంగా గమ్యం చేర్చారు. ఏర్పాట్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా అధికార యంత్రాంగం దగ్గరుండి పర్యవేక్షించారు.

## అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు


**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లా వ్యాప్తంగా ప్రజల రక్షణ కోసం రహదారులపై ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు,వాగులు వద్దకు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు,బారికేడ్లు ఏర్పాటు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రంగాన్ని అప్రమత్తం చేయాడం జరిగిందని,ప్రజలు అత్యవసరమైతే తప్ప ఎవరు కూడా బయటికి రాకూడదని ఎస్పీ తెలిపారు. పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని,ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే,స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరని,అధికారుల సూచనలను పాటిస్తూ పోలీసు వారికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు.

## వరద ముప్పు నేపథ్యంలో భద్రతా చర్యలు

**వేద న్యూస్, చందుర్తి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ పరిస్థితిని వరిశీలించేందుకు చందుర్తి ఎస్ఐ జె.రమేష్ , సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు కలిసి మల్యాల, మూడపల్లి, తిమ్మాపూర్, ఎంగల్ గ్రామాలను సందర్శించారు. కల్వర్టులు, వాగులు వద్ద వరద ముప్పు ఉండటంతో బారికేడ్లు, తాడులు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టారు. సిబ్బందిని నియమించి, పహారా కట్టేలా సూచనలు ఇచ్చారు. గ్రామస్థులు జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాల్సిందిగా సూచించారు. మండలంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

వేద న్యూస్

శుక్రవారం ఆగస్టు 29, 2025

# మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

**వేద న్యూస్,వరంగల్ టౌన్:**



మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు.గురువారం కాశీబుగ్గ సర్కిల్ ఆఫీస్ వద్ద కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయానికి మార్ట్ ఏర్పాటు కోసం క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలకు కొటీశ్వరులు చేయాలనే దృఢ సంకల్పంతో మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అందులో భాగంగా స్వయం సహాయక మహిళ సంఘాల వారి వివిధ రకాల ఉత్పత్తులను ప్రోత్సహించుటకు గాను మహిళ మార్ట్ ను ఏర్పాటు చేస్తున్నట్లు మేయర్ తెలిపారు. వరంగల్ పరిధి కి సంబంధించి కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం లో గ్రౌండ్ ఫ్లోర్‌లో గల 5 గదులను పునరుద్ధరించి, నవికరించి మహిళ మార్ట్ త్వరితగతిన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసిపిలు ఖలీల్ ప్రశాంత్ ఇంచార్జి ఈ ఈ సంతోష్ బాబు,సూపరింటెంట్ హబీబ్ ఆర్ ఓ షెహజాది బేగం,టి పి ఎస్ లు అనిల్ శ్రీకాంత్ ఏ ఈ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం


**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆదేశాల మేరకు డిప్యూటీ డెమో అనిల్ కుమార్ పిపి యూనిట్ నర్సంపేట, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చెన్నారావుపేట మండలంలో ఆరోగ్య ఉపకేంద్రం బోడతండ డెంగ్యూ పాజిటివ్ ఏరియాలో పర్యటించి అవగాహన కల్పించారు. సీజన్ కు అనుకూలంగా సంక్రమిత వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు, నీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, రక్త విరేచనాలు, జ్వరం మొదలగు వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కలుషితము గాని ఆహారము, నీరు తీసుకోవాలని తెలిపారు . గ్రామంలో డెంగీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి ఇంటికి వెళ్లి తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. సిబ్బంది సహాయముతో ఇండోర్ స్ప్రే, అవుట్ డోర్ స్ప్రే పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వైద్య సిబ్బందికి తెలిపి ,వారి సహాయం ద్వారా తగిన పరీక్షలు, చికిత్సలు తీసుకొని ఆరోగ్యవంతమైన జీవితము గడపాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ వివిధ శాఖల సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యం పై అవగాహన కల్పిస్తూ అవసరమున్న వారికి తగిన సేవలందిస్తున్న మాని తెలిపినారు. వర్షాకాలంలో గర్భిణీ స్త్రీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య ఆరోగ్య శాఖలోని సిబ్బంది వారికి ముందుగా అవగాహన కల్పించి అవసరమున్న వారిని తప్పకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో చేరవేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు అందించే సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో డిప్యూటీ డెమో అనిల్ కుమార్ , సబ్ యూనిట్ ఆఫీసర్ నంద, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత, ఆరోగ్య కార్యకర్తలు కవిత, శివాజీ, లలిత, ఆశ కార్యకర్తలు సునీత, లలిత ,పద్మ, రేణుక, రాధా ,గాయత్రి మొదలగు వారు పాల్గొన్నారు.

# భర్తను భార్య వద్దకు చేర్చిన మడికొండ పోలీసులు

**వేద న్యూస్, మడికొండ :**





మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కడిపికొండ గ్రామానికి చెందిన కొడవటి యువరాజు అను వ్యక్తి గత ఏడు నెలల కింద తప్పిపోగా మడికొండ సిఐ పుల్యాల కిషన్, ఎస్ఐ రాజ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం అతను మొబైల్ సిగ్నల్ ఆధారంగా వెతికి పట్టుకొని తన భార్య కొడవటి విజయ కు అప్పగించామని మడికొండ సిఐ కిషన్ తెలిపారు. ఈ సంవత్సరం జనవరి 29వ తేదీన ఇంటి నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడని అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసామని, అతని గురించి వెతకగా, అతని సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతడు శ్రీశైలం, కడప, గుంటూరు తదితర ప్రదేశాలకు వెళ్ళాడని, చిట్ట చివరకు అతడు ఒంగోలు జిల్లా గ్రంథాలయ చీమకుర్తి లో ఉన్నాడని తెలుసుకుని అతనిని అక్కడ నుండి తీసుకుని వచ్చి అతనిని అతని భార్య అయిన విజయకు అప్పగించడం జరిగిందన్నారు. తన భర్తను తనకు అప్పగించడంతో ఆనందం తో విజయ పోలీస్ వారికి ధన్యవాదములు తెలిపిందని సిఐ కిషన్ తెలిపారు.

# స్థానిక సంస్థల ఓటర్ల జాబితా సవరణను వాయిదా వేయాలి

## - రాష్ట్ర ఎన్నికల సంఘానికి కేటీఆర్ లేఖ

## - వర్షాలు, వరదల దృష్ట్యా ఓటర్ల జాబితా సవరణ వాయిదా వేయాలి

**వేద న్యూస్ డెస్క్:**



రాష్ట్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పార్టీ నేతలు లేఖ రాశారు. స్థానిక సంస్థల ఓటర్ల జాబితా సవరణను వెంటనే వాయిదా వేయాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. వర్షాలు, వరదల దృష్ట్యా ఓటర్ల జాబితా సవరణ వాయిదా వేయాలని కోరారు. వరద పరిస్థితుల్లో ప్రజలు ఓటరు జాబితాలను చూడలేరని పేర్కొన్నారు. ప్రజలు, అధికారులు సవరణ ప్రక్రియలో పాల్గొనడం అసాధ్యమని తెలిపారు. పారదర్శక వాతావరణంలో మరోసారి సవరణ ప్రక్రియ చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నోటిఫై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని జిల్లా పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అయితే ఆగస్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఇక ఆ మరునాడే.. అంటే ఆగస్టు 29వ తేదీన ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 30వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలాగే ఆగస్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఫొటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురణ చేస్తారని ఎన్నికల సంఘం తెలిపింది.

# విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగాలి

## - రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం

**వేద న్యూస్, కేయూ :**




కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఉమెన్స్ ప్రథమ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు గురువారం ఉదయం విశ్వవిద్యాలయం సెట్ హాల్లో కళాశాల ప్రిన్సిపాల్ కె. బిక్షాలు అధ్యక్షతన జరిగిన విద్యార్థుల అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం మాట్లాడారు. ఈ సంవత్సరం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు విశ్వవిద్యాలయంలోని వసతుల గూర్చి, అధ్యాపకులతో నాణ్యమైన విద్యను అందించడంలో మహిళా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపక బృందం ముందంజలో ఉందని విశ్వవిద్యాలయంలో ఎలాంటి ర్యాగింగ్ ఉండదు అని విద్యార్థినులకు మహిళ సెక్యూరిటీ ద్వారా భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. కళాశాలలో విద్యార్థినులను మా సొంత పిల్లలలాగా చూసుకుంటామని వివిధ జిల్లాల నుండి ఇతర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి అపోహాలు పెట్టుకోకూడదని అన్నారు. విద్యతోపాటు ఆల్ రౌండ్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులకు ప్రతి సెక్షన్ కి ఒక కోఆర్డినేటర్ ఉంటారని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ధైర్యంతో ముందుకు సాగాలని అన్నారు. ఎన్.ఐ.టి నుండి అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ ఎమ్.సైలేజ కుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఏదైనా సాధించాలి అంటే పట్టుదలతో ముందుకు సాగాలని మానవ శరీరానికి జ్ఞానేంద్రియాలు ఎంత అవసరమో ఇంజనీరింగ్ చదువుకోవాలనుకునే విద్యార్థులకు అన్ని కోర్సులు కూడా అలాంటివే అని సమాజానికి ఏ కోర్సైన ఉపయోగా పడుతుందని అందరూ ఒకే దానికి మొగ్గ చూపాల్సిన అవసరం లేదని ప్రతి సబ్జెక్టు కు విద్యార్థులు మక్కువ చూపాలని అన్నారు. చదువుకోవాలని దృక్పథం ఉన్నవాళ్లు ఏ కళాశాలలోనైనా పట్టు సాధించి ప్లేస్మెంట్ కి హారులు అవుతారని అన్నారు. ఈ రోజుల్లో కంప్యూటర్ యుగం అయినప్పటికీ ఇంజనీ రింగ్ కోర్సుల ద్వారా ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలలో కూడా సముచిత స్థానం ఉందని అన్నారు సుమారు కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రతి ఏటా ఆఖరి సంవత్సరం విద్యార్థులు ప్లేస్ మెంట్ ద్వారా ఉపాధి పొందుతున్నారని అన్నారు. విద్యకు భయపడకుండా ముందుకు సాగినప్పుడే సమాజంలో దేనినైనా ఎదుర్కో కలుగుతామని మహిళ అనగానే నిరుత్సా పడాల్సిన అవసరం లేదు అని తాను ఒకప్పుడు తెలుగు మీడియం విద్యార్థినేనని అయినప్పటికీ నా పట్టుదలతో నేను ఈరోజు ప్రొఫెసర్ గా అయ్యానంటే నా లోపల ఉన్న పట్టుదలేనని అన్నారు. మీరు కూడా ఎన్నో శిఖరాలకు ఎదగాలని కోరుకుంటున్నాను అని ధైర్యం చెప్పారు. ప్రిన్సిపాల్ కె.బిక్షాలు మాట్లాడుతూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల 2013లో ఏర్పడినప్పటి నుండి నేటి వరకు క్రమక్రమేన మెరుగు పడుతున్నదని ఇతర కళాశాలలకు దిక్సూచిగా మారిందని ఈ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్, మరియు ఎన్.సి.సిలు కూడా ఉన్నాయని ప్లేస్మెంట్లో ముందంజలో ఉంటుందని వినూత్నమైన లైబ్రరీ, ల్యాబ్ లు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయని వారికి అవగాహన కల్పించడానికి ఇతర ప్రాంతాల్లోని సాంకేతికపరమైన తయారీ కేంద్రాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తామని అన్నారు. ఉదయం సాయంత్రం రిజిస్టర్ కళాశాలను పర్యవేక్షిస్తారని విద్యార్థులకు అనుకూలమైన వసతులు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వాణిశ్రీ, వీణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎవివి విద్యార్థి ఎంపిక

**వేద న్యూస్,వరంగల్ టౌన్:**



వరంగల్ జిల్లాలోని ఎవివి పాఠశాలకు చెందిన తేజావత్ రామ్ చరణ్ 11వ తెలంగాణ స్టేట్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ కి ఎంపికైనట్లు ఆ పాఠశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా. అనిత గురువారం తెలిపారు. ఈనెల 22వ తారీకున హనుమకొండ జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన వరంగల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో రామ్ చరణ్ పాల్గొని లాంగ్ జంప్ లో ప్రథమ స్థానం మరియు 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం అలాగే 200 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించాడు. రామ్ చరణ్ జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరచడం ద్వారా ఈనెల 30 మరియు 31 తేదీలలో మహబూబ్నగర్ లోనీ పాలమూరు యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా. అనిత మాట్లాడుతూ ఆటలు శారీరక మరియు మానసిక వ్యక్తిత్వానికి అలాగే జీవితంలో పైకి ఎదగడానికి ఉపయోగపడతాయని తెలిపారు. రామ్ చరణ్ ని ఉద్దేశించి రాష్ట్రస్థాయిలో కూడా మంచి అత్యున్నత ప్రతిభ కనబరిచి మన పాఠశాలకు మరియు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చి జాతీయస్థాయి పోటీలకు కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాంచరణ్ ని పాఠశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా. అనిత, సంకతాల సంజీవ, గందె శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ డా. బరుపాటి గోపి, లైబ్రేరియన్ మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొడిమాల శ్రీనివాస రావు, రమ్య కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం సంధ్యా రాణి, నవీన్, డా. విజయలక్ష్మి, వసంతరాణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ మహేందర్, రాజశేఖర్ తదితరులు అభినందించారు.

# రోగులకు మెరుగైన సేవలు అందించాలి

**వేద న్యూస్, హన్మకొండ:**



జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య కడిపికొండ పిహెచ్సి పరిధిలోని బట్టుపల్లి ఆరోగ్యఉపకేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అందుతున్నటువంటి సేవలు మరియు ఉప కేంద్ర భవన నిర్మాణానికి సంబంధించి వివరాలు తెలుసుకోవడం జరిగినది. ప్రసూతి అనంతర సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకోవడానికి హై రిస్క్ ప్రెగ్నెన్సీ ఉండి జీఎం ఎచ్ గవర్నమెంట్ హాస్పిటల్లో నార్మల్ డెలివరీ అయిన రేణిగుంట్ల శ్రావణి ని కలిసి సిస్టర్లు ఆశాలు అందిస్తున్న ప్రసవానంతర సేవలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం గ్రామంలో ఫీవర్ సర్వే ,డ్రైడే కార్యక్రమం సంబంధించిన వివరాలను పరిశీలించారు.గవర్నమెంట్ లో బీపీకి 75, డయాబెటిస్ 48 మంది చికిత్స తీసుకుంటున్నట్లు సిబ్బంది తెలియజేశారు. ఎన్ సి డి రీ స్క్రీనింగ్ నిర్వహించాలని ,బిపి డయాబెటిస్ తో బాధపడుతున్న వారికి ప్రైవేట్ నుంచి గవర్నమెంట్ కు మళ్ళించాలని, ఏ .న్.సి రిజిస్ట్రేషన్లు టార్గెట్ అనుగుణంగా చేయాలని, ఉప కేంద్ర ఓపి, స్టాక్, బాలింతలకు అందుతున్న సేవలు, వయవృద్ధులకు అందుతున్నటువంటి సేవలు పరిశీలించడమైనది.

అనంతరం గవర్నమెంట్ సివిల్ డిస్పెన్సరీ కాజీపేట ను సందర్శించి అందులో అందుతున్నటువంటి ఓపి సేవలు మరియు ఫార్మసీ, ఉద్యోగుల హాజరు పరిశీలించడమైన ది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంట డాక్టర్. జయ కృష్ణ, హెల్త్ విజిటర్ పద్మజ, హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ పద్మజ, సుశీల, సల్మా , జి సి డి సిబ్బంది ,ఆశా కార్యకర్తలు ఉన్నారు.


# రిషిక తల్లిపిల్లల ఆస్పత్రిలో బిగ్ ఆఫర్

**- వచ్చే నెల 1 నుంచి 10 వరకు**

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని రిషిక తల్లిపిల్లల ఆస్పత్రి నిర్వాహకులు ప్రజలకు బిగ్ ఆఫర్ ఇస్తున్నట్టు ప్రకటించారు. వచ్చే నెల 1 నుంచి 10 వరకు రూ.7 వేలు విలువ గల ఇన్‌ఫెర్టిలిటీ ప్రొఫైల్ రూ.2,900కే అందించనున్నట్టు వెల్లడించారు. ఈ ఫీజులోనే గైనకాలజిస్ట్ ఓపీడీ ఫీజు ఉండనుంది. ఇక టెస్టుల విషయానికొస్తే.. సీబీపీ, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్, ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, థైరాయిడ్ ప్రొఫైల్, సీరమ్ ప్రొలాక్టిన్, ఏఎంహెచ్, అల్ట్రాసౌండ్ పెల్విస్ కవర్ కానున్నాయి. ప్రతి మంగళవారం ఆస్పత్రిలో ఆడవారికి ఉచిత ఓపీ చూడనున్నారు. ల్యాపరోస్కోపిక్ సర్జన్, ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, స్త్రీల, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ కె.జ్యోతిరెడ్డి.. ఎంఎస్(ఓబీజీ), ఎఫ్ఎంఏఎస్, డీఎంఏఎస్.. రిషిక తల్లిపిల్లల ఆస్పత్రి అందుబాటులో ఉండనున్నారు.

# ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య..!



**వేద న్యూస్, రాయికల్:**

రాయికల్ మండలం చింతలూరు శివారులో జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో నివసించే సుద్దేవార్ వినోద్ (21) అనే యువకుడు బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ దేవేందర్ తెలిపారు. ఇంటి వద్ద ఖాళీగా ఉండడంతో ఏదైనా పని చేసుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్ళిన వినోద్ ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. మృతుని తండ్రి రాములు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నానమన్నారు.

# పొంగిపొర్లుతున్న వాగులు



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు నిండుకుండలా మారి పొంగిపొర్లుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగంపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో బండ లింగంపల్లి బ్రిడ్జిని ఆనుకొని ఉన్న రోడ్డు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు బ్రిడ్జిని ఆనుకొని వెళ్లడంతో రోడ్డు కోత గురి కావడం వల్ల గ్రామస్తులు వెంటనే తాసిల్దార్ కు సమాచారం అందించడంతో, ఎల్లారెడ్డిపేట మండల తహసిల్దార్ సుజాత వచ్చి కోత గురైన రోడ్డును పరిశీలించి మరమ్మత్తుల కోసం పై అధికారులకు నివేదిక అందించడం జరిగిందని తెలిపారు.. ఆ రోడ్డు కుండా ప్రయాణం చేసే వాహనదారులు జాగ్రత్తగా చూసుకుంటూ ఆ మార్గం గుండా వెళ్లాలని సూచనలు చేశారు.

# గణపతి మండపాలకు క్యారమ్ బోర్డుల పంపిణీ



**వేద న్యూస్, హన్మకొండ :**

టిపిసిసి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి మొహమ్మద్ ముస్తాక్ నేహాల్ ఆధ్వర్యంలో గణపతి నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా బాలసముద్రం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా డివిజన్ కు రెండు చొప్పున గణపతి మండపాలకు క్యారమ్ బోర్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు, సోషల్ మీడియా నాయకులు రోషన్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

# నాయినివి అవగాహన లేని మాటలు..!

- **బండి సంజయ్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు విడ్డూరం**
- **ఉమ్మడి వరంగల్‌కు పదిమంది ఎమ్మెల్యేలు ఉన్నా దండగే..!**
- **సంక్షేమాన్ని పట్టించుకోని ఇద్దరు మంత్రులు**
- **నగరాభివృద్ధికి కలిసి పనిచేయడానికి బీజేపీ సిద్ధమే**
- **బీజేపీ వరంగల్ అధ్యక్షుడు గంట రవికుమార్**




**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అవగాహన లేని వ్యక్తి అని, అభివృద్ధి చేయడం చేతకాక కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ విమర్శించారు. గురువారం వరంగల్ చౌరస్తా బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు ఉండీ ఏం లాభమని ప్రశ్నించారు. ఉమ్మడి వరంగల్‌లో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని విమర్శించారు. ఓ వైపు వరంగల్ అభివృద్ధికి కేంద్రం స్మార్ట్ సిటీ కింద నిధులు మంజూరు చేస్తుంటే, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఒక్కపైసా తేలేని స్థితిలో ఇక్కడి నాయకులు ఉన్నారంటూ మండిపడ్డారు.

**- నాయిని.. బీసీలకు మాత్రమే 42శాతం ఇస్తే స్వాగతిస్తాం**

బీసీ రిజర్వేషన్‌పై నాయిని రాజేందర్‌రెడ్డికి ఏమైనా అవగాహన ఉందా అంటూ గంట రవికుమార్ ప్రశ్నించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తే స్వాగతిసామని, కాంగ్రెస్ కుట్ర పూరితంగా 10శాతం ముస్లింలను కలుపుకుని అంతా బీసీ రిజర్వేషనే అంటూ నాయిని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంజీఎం.. వరంగల్ బస్టాండ్ కనిపించడం లేదా..సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయిని బండి సంజయ్‌ను వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని గంట రవికుమార్ సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రధాన కేంద్రంగా ఉన్న పశ్చిమ నియోజకర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి ఇక్కడ జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. కాజీపేట దర్గా, హనుమకొండ జైన్‌మందిర్ గుట్టకు స్మార్ట్ సిటీ కింద నిధులు కేంద్ర ఇచ్చిన విషయం మరిచారా అంటూ ప్రశ్నించారు. ఎంజీఎం ఆస్పత్రి దయనీయంగా మారినా నాయినికి కనిపించడం లేదా అని గంట నిలదీశారు. భవనం పెల్చులూడుతున్నాయని, కనీసం ఫ్యాన్లు కూడా లేకపోవడంతో పేద రోగుల ఇంటి నుంచి ఫ్యాన్లు తెచ్చుకుంటున్న విషయం కనిపించడం లేదన్నారు. రాష్ట్రంలో మీరే అధికారంలో ఉన్నారు కదా.. వరంగల్ బస్టాండ్ నిర్మాణం కోసం ఎందుకు కృషి చేయడం లేదని సూటిగా ప్రశ్నించారు. ఎంజీఎం, వరంగల్ బస్టాండ్ నిర్మాణంపై బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. ఓట్ల గల్లంతుపై తోకముడిచిన రాహుల్ గాంధీ.. బీహార్‌లో ఓట్ల గల్లంతుపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. గల్లంతైన వారి వివరాలు ఇవ్వాలని ఎలక్షన్ కమిషన్ కోరినా తోక ముడిచి.. ఓట్ చోర్ అంటూ బీజేపీపై వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని గంట రవికుమార్ అన్నారు. నిజానికి కాంగ్రెస్సే మతతత్వ పార్టీ అని విమర్శించారు. అయోధ్య రామాలయం, మహాకుంభ మేళ జరిగితే అక్కడికి వెళ్తే ఎక్కడ మైనారిటీ ఓట్లు పడవనే భయంతో వెళ్లలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, కోశాధికారి కూచన క్రాంతి కుమార్, అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుదర్, కార్యాలయ కార్యదర్శి పెద్ది నవీన్ గార్లు పాల్గొన్నారు.

# విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించిన నాయకులు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**




కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ ప్రైవేటీకరణకు పూనుకుంటున్నదని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్ అన్నారు. 25 సంవత్సరాల క్రితం జరిగిన విద్యుత్తు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన ముగ్గురు వీరులకు ఖిలా వరంగల్ పడమరకోట, తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గంగుల దయాకర్ మాట్లాడుతూ గతంలో విద్యుత్ రంగం రాష్ట్రాల జాబితాలో ఉండేదని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2023 చట్టం ద్వారా తన ఆధీనంలోకి తీసుకొని బడా పెట్టుబడిదారులైన కార్పొరేట్లు అంబానీ ఆదానీలకు విద్యుత్ రంగాన్ని అప్పగిస్తున్నదని ఆయన అన్నారు. 2000 సంవత్సరంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ప్రపంచ బ్యాంకు జీతగాడిగా మారి విద్యుత్తు విద్యుత్తు ప్రైవేటీకరణకు పూనుకుంటే వామపక్ష విప్లవ పార్టీలు ప్రజాసంఘాలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడిన పోరాడా పోరా డాయన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని చలో హైదరాబాద్ కార్యక్రమంలో నిర్వహించారని వారు గుర్తు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం బషీర్బాగ్ సెంటర్లో విద్యుత్తు ఉద్యమకారులపై కాల్పులు జరిపి రామకృష్ణ బాలస్వామి విష్ణువర్ధన్ రెడ్డిలను బలి తీసుకొని నాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు జరిపిన జలియన్వాలా బాగ్ ఘటనను మరిపింప చేసిందని ఆయన అన్నారు. నేడు చంద్రబాబు మోడీ ఒక్కటై దేశ కార్పొరేట్లకు బహుళ జాతి సంస్థలకు సామ్రాజ్యవాద దేశాలకు తొత్తుగా మారి పోయి ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాబోవు రోజుల్లో మోడీ ప్రభుత్వం చేస్తున్న విద్యుత్తు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడటమే వారికి , అందించే ఘనమైన నివాళులు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గద్దల ప్రభాకర్, ఇనుముల కృష్ణ, అయిత యాకయ్య, బండి చంద్రమౌళి, ఎండి అక్బర్, రాజు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు

**వేద న్యూస్,వరంగల్ ప్రతినిధి:**

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, సిపి ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాలు అధికారులను ఆదేశించారు. గురువారం వారు జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయితో కలసి వరంగల్ నగరంలోని చిన్న వడ్డేపల్లి చెరువు తదితర గణేష్ నిమజ్జన ప్రాంతాల్లో చేస్తున్న ఏర్పాట్లను క్షేత్ర స్థాయి లో పరిశీలించి సమర్ధవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 5న నిమజ్జనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం గణేష్ నిమజ్జమం సులభంగా జరుగుటకు నిమజ్జన ప్రాంతాల్లో బ్యారీకేడింగ్ ను ఏర్పాటు చేయాలని, తగినంత క్రేన్లు, విగ్రహాల నిమజ్జనానికి సరిపోను తెప్పలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. కోట చెరువులో నిమజ్జనం నిషేధించబడినందున చిన్న వడ్డేపల్లి చెరువులో ఎక్కువ విగ్రహాలు వచ్చే ఆస్కారం ఉన్నందున నిమజ్జనం సమయంలో రద్దీని నియంత్రించడం, ప్రజల భద్రత వంటి అంశాలపై దృష్టి సారించాలని అధికారులకు వారు సూచించారు. ఆయా నిమజ్జన ప్రాంతాల్లో శానిటేషన్, తగినంత హై మాస్ట్ లైటింగ్, మంచినీటి సౌకర్యం, ఏర్పాట్లు ఉండేలా చూడాలని జిడబ్ల్యూ ఎంసీ అధికారులను ఆదేశించారు. జిడబ్ల్యూ ఎంసీ, నీటిపారుదల, విద్యుత్, అగ్నిమాపక పోలీసు శాఖల అధికారుల సమన్వయంతో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా చూడాలని అన్నారు.

నిమజ్జనం ప్రశాంత వాతావరణం లో జరిగే విధంగా చూడాలని, చెరువులో నీటి మట్టం ఎక్కువగా ఉన్నందున గజ ఈతగాళ్లు అందుబాటు లో ఉండేలా సంసిద్ధం గా ఉండాలని అన్నారు. అధికారులు సమన్వయంతో నిమజ్జన ప్రాంతాలలో ఏర్పాట్లను పూర్తి చేసి విధులను నిర్వర్తించాలన్నారు. నిమజ్జన ప్రదేశాలలో తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల రాకపోకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా అన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, డీసీపీలు రాయల ప్రభాకర్, షేక్ సలీమా, వరంగల్ సబ్ డివిజన్ ఎస్పి శుభం ప్రకాష్, రెవెన్యూ, జిడబ్ల్యూ ఎంసీ, నీటిపారుదల, విద్యుత్తు, పోలీసు , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పెద్ద చెరువును పరిశీలించిన అధికారులు

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ లో ఉన్న పెద్ద చెరువును కమలాపూర్ మండల అభివృద్ధి అధికారి గుండె బాబు, తహసిల్దార్ సురేష్, కమలాపూర్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ, సబ్ ఇన్స్పెక్టర్ మధు లు పరిశీలించారు. వినాయక నిమజ్జనం కమలాపూర్ పెద్ద చెరువులో జరుగుతుంది కనుక ముందస్తుగా చెరువును పరిశీలించి తగిన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలని గ్రామపంచాయతీ సిబ్బందికి అధికారులు ఆదేశించారు.



వేద న్యూస్

శుక్రవారం ఆగస్టు 29, 2025

# మనసున్న మాస్టారు

- పిల్లలు ఆంగ్లంలో పట్టు సాధించేలా బోధన
- విద్యార్థులకు విద్యను అందించడంలో ప్రత్యేక శ్రద్ధ
- బ్రిటిష్ కౌన్సిల్ పబ్లికేషన్స్‌లో జెడ్పీహెచ్ ఎస్ఏ ఇంగ్లిష్ టీచర్ ప్రాజెక్ట్ ఆర్టికల్
- యాక్షన్ రీసెర్చ్ మెంటారింగ్ స్కీమ్(ఏఆర్ఎంఎస్)లో భాగంగా ప్రజెంటేషన్
- బ్రిటిష్ కౌన్సిల్ చెన్నయ్ ఆఫీసుకు వెళ్లి టీచర్ రామంచ భిక్షపతి ప్రజెంటేషన్




**వేద న్యూస్, వరంగల్:**

ఉదయాన్నే విధులకు హాజరై.. సాయంత్రం కాగానే విధులు ముగించుకుని ఇంటికెళ్లే మనస్తత్వం కాదు ఆయనది.. విద్యతోనే సమాజంలో, విద్యార్థుల జీవితాల్లో మార్పు బలంగా వస్తుందని నమ్మే ఆయన.. విద్యా బోధన పట్ల అత్యంత శ్రద్ధ వహిస్తారు. మంచి మనసున్న మాస్టారుగా పేరు గాంచిన ఆయన.. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పిల్లలకు ఇంగ్లిష్ బోధించడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఇందుకు సంబంధించిన ప్రాజెక్టును బ్రిటిష్ కౌన్సిల్ పబ్లికేషన్స్‌లో ఆర్టికల్‌గా ప్రచురించడం విశేషం. ప్రాజెక్టు ప్రజెంటేషన్‌ను సదరు టీచర్ బ్రిటిష్ కౌన్సిల్ చెన్నయ్ ఆఫీసులో ఇవ్వగా, సభికులు హర్షం వ్యక్తం చేశారు. 8,9 వ తరగతుల విద్యార్థులకు బైలింగ్యువల్ అప్రోచ్ ద్వారా ఇంగ్లిష్‌ను బలంగా నేర్చుకునే విషయమై ఆయన రీసెర్చ్ పేపర్‌ను ప్రజెంట్ చేశారు. ఇంతకీ ఆయనెవరంటే..జెడ్పీహెచ్ ముల్కనూరు బాయ్స్ స్కూల్ ఎస్ఏ ఇంగ్లిష్ టీచర్ రామంచ భిక్షపతి. బ్రిటిష్ కౌన్సిల్ యాక్షన్ రీసెర్చ్ మెంటారింగ్ స్కీం (ఏఆర్ఎంఎస్ ) ప్రాజెక్ట్ ఎన్ఐటీ వరంగల్, ఐఐటీడీఎం కాంచీపురం, గౌహతి, యూనివర్సిటీస్ సహకారంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు వారి తరగతి గదులలో ఇంగ్లీష్ బోధనలో వచ్చే సమస్యలను ఏ విధంగా పరి ష్కరించాలో పరిశోధన పరిష్కారాలను కనుగొని బ్రిటిష్ కౌన్సిల్ ఆధ్వర్యంలో చెన్నయ్‌లో వారి పరిశోధనలు ప్రజెంట్ చేశారు. 11 ఆగస్టు 2025న వివిధ రాష్ట్రాల నుంచి 70 మంది ఉపాధ్యాయులు వారి పరిశోధనలను ప్రజెంట్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రస్తుతం హనుమకొండ జిల్లా నుంచి రామంచ భిక్షపతి తన రీసెర్చ్ పేపర్‌ను ప్రజెంట్ చేశారు. 8వ, 9 వ తరగతి విద్యార్థులకు ఆంగ్లంలో బోధన విషయంలో తను అనుసరించిన పద్ధతిని రీసెర్చ్ పేపర్‌గా బ్రిటిష్ కౌన్సిల్ వారికి సమర్పించారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**వేద న్యూస్,బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఆదేశాల మేరకు జిల్లాలో ప్రాణం ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. బోయినిపల్లి మండలంలోని మధ్య మానేరు రిజర్వాయర్ వద్ద మానేరు జలాలకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వద్దకు చేరుకొని ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో పై అరా తీశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం ఎంత ఉందో నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రాజెక్టులోకి సిరిసిల్ల మానేరు వాగు, వేములవాడ మూలవాగు నుంచి, ఎస్ఆర్ఎస్పీ, వరద కాలువ నుంచి వరద ప్రవాహం వస్తుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 27. 5టీఎంసీలు కాగా, 21.5 టీఎంసీలు నీరు ఉందని, 75 వేల క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వస్తుందని, ఔట్ ఫ్లో 57 వేల క్యూసెక్కులు ఉందని అధికారులు కలెక్టర్, ఎమ్మెల్యే, దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాట్లాడారు. నీటి మట్టాన్ని పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేసిన చేస్తున్న సమయంలో ప్రజలను రైతులను అప్రమత్తంగా ఉండేలా ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని ఆదేశించారు. ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన రైతులను సీఎం రేవంత్ రెడ్డి, సూచన మేరకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్ ద్వారా క్షేమంగా గమ్యం చేర్చారని వివరించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే, దగ్గరుండి ముమ్మర చర్యలు చేపట్టారని పేర్కొన్నారు ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డీఈలు శ్రీనివాస్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# అధికారి అంటే ఇలా ఉండాలి

- గుండేడు ప్రాథమిక పాఠశాలలో నిలిచిన వరద నీరు
- విషయం తెలిసిన వెంటనే ప్రాథమిక పాఠశాలకు ఎంపీడీవో
- దగ్గరుండి మరి సమస్యకు పరిష్కారం
- ఎంపీడీవో గుండె బాబు పని తీరుపై సర్వత్రా ప్రశంసలు



**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండేడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు నీరు పాఠశాల ఆవరణలోనే నిలిచి ఉండడంతో ఆ విషయాన్ని తెలుసుకున్న కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు వెంటనే సంబంధిత పాఠశాలను సందర్శించారు. సమస్య గురించి పూర్తిగా తెలుసుకున్న ఎంపీడీవో గ్రామపంచాయతీ సిబ్బందిని పిలిపించి డ్రైనేజీని శుభ్రం చేయించి పాఠశాలలో నిలిచి ఉన్న వరద నీరంతా డ్రైనేజీ కాలువ ద్వారా కిందికి వెళ్లే విధంగా చేయించి సమస్యను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపూర్ మండల ప్రజలందరూ వర్షాలు తగ్గుముఖం పట్టనందున భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు ఉన్నందున సాధ్యమైనంత వరకు ప్రజలు తమ తమ ఇండ్లలోనే ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని ఏమైనా పనులు ఉంటే వాటన్నిటినీ వాయిదా వేసుకోవాలని అన్నారు. ప్రజలు తమ ఇంటి లోని చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వస్తువులను తీసుకొచ్చి నాలాల్లో గాని డ్రైనేజీ కాలువల్లో గాని పడవేయవద్దని అలా చేయడం వల్ల డ్రైనేజీ కాలువల్లో చెత్తంతా పేరుకుపోయి నీరంతా దిగువకు పోకుండా అక్కడే నిలిచి ఉంటుందని, అది నిండిన తర్వాత ప్రజల ఇండ్లలోకి నీరంతా చేరుకుంటుందని దానివల్ల ప్రజలకే రోగాలు సంభవిస్తాయని అన్నారు. గ్రామంలోని సమస్యల పట్ల గ్రామపంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు గ్రామంలో పర్యవేక్షణ చేస్తూ ఉండాలని ముఖ్యంగా డ్రైనేజీ కాలువలపై బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, వీధుల వెంట దోమలు లేకుండా ఫాగింగ్ చేయించాలని అలాగే నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని సూచించారు. అంతేకాకుండా గ్రామంలో ఎలాంటి సమస్య తలెత్తిన పంచాయతీ కార్యదర్శులు సకాలంలో స్పందించి వివిధ శాఖలను సమన్వయం చేసుకొని త్వరితగతిన సమస్యలకు పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా ఎంపీడీవో గుండె బాబు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

# పాపయ్యపేట గణేశుడు



**వేద న్యూస్, వరంగల్ :**

గ్రేటర్ వరంగల్ 29 వ డివిజన్ లోని, పాపయ్యపేటలో శ్రీ కాకతీయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర విగ్రహాన్ని దాతలు రాచర్ల కళ్యాణ్, గడ్డమీది సన్నీ, మరియు యూత్ సభ్యులు ప్రతిష్ఠించారు. ఉదయం స్వామి వారిని డప్పు చప్పుళ్ళతో, మేళా వాయిద్యాలతో అంగరంగ వైభవంగా, ఊరేగింపుతో మండపం వరకు తీసుకువచ్చి, అనంతరం గణపయ్యను ప్రతిష్టించారు. పంచవర్ణ మాలతో సిద్దేశ్వరున్ని అలంకరించి, వేద పండితునిచే పూజా క్రతువు నిర్వహించి పలు రకాల పండ్లను, నైవేద్యాలను బొజ్జగణపయ్య కు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ – ప్రసాద వితరణ చేశారు. పూజా కార్యక్రమంలో యూత్ సభ్యులు కిషన్, అఖిల్, వంశీ, వర్ధన్, బబ్లు, బన్నీ, సూరి, గౌతమ్, వివేక్, లడ్డు, చోటూ, బిట్టు, లక్కీ,సంధ్య, బుజ్జక్క, విజయ, రాణి, సాహితీ, మరియు స్థానికులు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రాణం మీదకు తెచ్చిన పందెం

**వేద న్యూస్ డెస్క్:**

గత వారం రోజుల నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు దంచి కొడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్ధిపేట జిల్లాల్లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సూర్యాపేట జిల్లాలో కొందరు యువకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. పొంగిపొర్లుతున్న వాగు దాటే పందెం వేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ యువకుడు ప్రమాదానికి గురయ్యాడు. వరదలో కొట్టుకుపోయాడు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. అనంతగిరి మండలం గొండ్రియాలలో పాలేరు వాగు పొంగిపొర్లుతోంది. ఏం పిచ్చిపట్టిందో ఏమో కానీ, ఓ ముగ్గురు యువకులు ఉధృతంగా పొంగి పొర్లుతున్న వాగు దాటాలని పందెం వేసుకున్నారు. పందెంలో భాగంగా ముగ్గురూ వాగు దాటుతున్నారు. ఈ నేపథ్యంలోనే వరద పోటెత్తడంతో ఓ యువకుడు కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న గ్రామస్థులు, పోలీసులు వాగు దగ్గరకు చేరుకున్నారు. యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న యువకుడి కుటుంబసభ్యులు బోరున విలపిస్తూ పాలేరు వాగు వద్దకు



చేరుకున్నారు. మరోవైపు హైదరాబాద్ చాదర్ ఘాట్ శంకర్ నగర్ వద్ద మూసీలో మరో వ్యక్తి గల్లంతయ్యాడు. శంకర్ నగర్‌కు చెందిన సలీం ఖురేషి(40) ఈత కొడుతూ ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కాగా, ఖురేషి కోసం హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073